RNI NO: APTEL/26/A3560

మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 148 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజిలు : 4 వెల రూ. 2 గురువారం -08 - అక్టోంబర్ - 2026

Published From : Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

- తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ
- భర్త అనిల్ కుమార్‌తో కలిసి సీఎంను కలిసిన షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహానికి విజయ్‌ను ఆహ్వానించిన దంపతులు
- వివాహ పత్రిక అందించి వేడుకకు రావాల్సిందిగా విజ్ఞప్తి

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం

- ★ భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- ★ దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- ★ దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, మిగతా 2 లో

రాయలసీమకు ఏం చేశారు? రూ.24,000 కోట్లు ఎక్కడ? చంద్రబాబుపై రోజా ఫైర్



- రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం విఫలమైందని రోజా విమర్శ
- కరవు, చంద్రబాబు కవలలుగా అభివర్ణన
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రకటించాలని సవాల్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు,

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. దర్శనానికి 12 గంటలు

- తిరుమల గిరులపై భక్తజన సందోహం
- టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 12 గంటల సమయం
- భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు
- మంగళవారం నాడు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు..

భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని వ్యాఖ్య

ప్రజా జీవితంలో మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా మిగతా 2 లో

- ప్రధాని మోదీపై భూటాన్ ప్రధాని పీఎం టోబ్గే ప్రశంసల వర్షం
- గ్లోబల్ సౌత్ గొంతుకను ప్రపంచ వేదికపై వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని వ్యాఖ్య
- 2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు

సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, మిగతా 2 లో

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

వాటిని మెడల్స్ గా భావిస్తా

తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ

- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం

ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, మిగతా 2 లో

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం.. బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ
- 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపణ

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు

- ★ బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- ★ గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- ★ జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం మిగతా 2 లో

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక.. రెండు డీఏలు విడుదల

- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది.

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు
సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్దత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.

సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

అందుకు దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా: ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోదీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, 'గ్లోబల్ సౌత్' దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్



అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ఏపీ కేబినెట్ ప్రత్యేక తీర్మానం ఆమోదించిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'తల్లికి వందనం'కు రూ.10,208 కోట్లు కేటాయించి 68.05 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కల్పించడంతో పాటు.. వసతి గృహాలు, గురుకులాల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు చెప్పారు. విదేశీ, ప్రైవేట్ వర్సిటీలను ఆకర్షించే ఉన్నత విద్యా విధానం-2026, గిరిజన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్, రేపల్లె ఆస్పత్రి విస్తరణ వంటి కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఆశా కార్యకర్తలకు రూ.1.50 లక్షల వరకు గ్రాట్యుటీ, కొండేపిలో గురుకులానికి 7 ఎకరాలు, ఆలయాభివృద్ధికి 7.66 ఎకరాల కేటాయింపుతో పాటు పేదల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి మంత్రుల సబ్‌కమిటీ ఏర్పాటు చేసినట్లు పార్థసారథి తెలిపారు.

కేబినెట్ భేటీలో 12 అంశాలకు ఆమోదం..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు సాగిన కేబినెట్ భేటీలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం రూ.20.62 కోట్ల ఖ్రూ×మీ ప్రాజెక్టుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. విశాఖ మరికవలసలో గిరిజన విద్యార్థుల కోసం ××-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీకి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్ గైర్హాజరయ్యారు. కేబినెట్ భేటీ అనంతరం రాజధాని భూముల అంశంపై మంత్రి నారాయణకు సీఎం పలు సూచనలు చేశారు. కేటగిరీ-4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని సీఎం తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తే నామినేటెడ్ పదవి
150 మంది కార్యకర్తలకు అవకాశం

తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి: పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు కొందర్ని ఎవరి సిఫారసు అవసరం లేకుండా నేరుగా నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయనున్నట్లు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. 2024 ఎన్నికలకు ముందు నుంచి పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆరు కార్యక్రమాల్లో పనితీరును ప్రామాణికంగా తీసుకుని పదవులకు ఎంపిక చేస్తామన్నారు. మొత్తం ఆరు కార్యక్రమాల్లోనూ అత్యుత్తమ పనితీరు కనబరిచి, అవార్డులు అందుకున్నవారికి తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఐదు, నాలుగు కార్యక్రమాల్లో అవార్డులు సాధించినవారికి అవకాశమిస్తామన్నారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో నిబద్ధతతో పాల్గొన్నవారిని గుర్తించి.. వారి స్థాయిని, సామర్థ్యాన్ని బట్టి రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో నియమిస్తాం. ఈ ప్రతిపాదనకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆమోదం తెలిపారు. పదవుల కోసం సుమారు 150 మందిని ప్రాథమికంగా గుర్తించాం' అని వివరించారు.

కార్యకర్తలను పట్టించుకోని ఎమ్మెల్యేలకు హెచ్చరిక

కార్యకర్తలకు మొదటి నుంచీ తెదేపా పెద్దపీట వేస్తోందని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని లోకేశ్ తెలిపారు. వారి సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.200 కోట్లు ఖర్చు చేశామన్నారు. 'ఎమ్మెల్యేలు నిరంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ, వారికి అందుబాటులో ఉండాలని చెబుతున్నాం. మాట వినని వారిని గట్టిగానే హెచ్చరిస్తున్నాం. కూటమి పార్టీలు విస్తృత సమన్వయంలో పనిచేస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా సర్దుబాటు చేసుకుంటూ ముందుకెళ్తాం. పార్టీ స్థాపించి నాలుగు దశాబ్దాలు దాటినా ఇంకా అన్ని జిల్లాల్లో కార్యాలయాల్లేవు. ప్రస్తుతం వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భవిష్యత్తులో నియోజకవర్గ స్థాయిలోనూ పార్టీ కార్యాలయాలు నిర్మిస్తాం. ముఖ్యమంత్రి, నేను కార్యకర్తలతో నిర్వహిస్తున్న సమావేశాలు వచ్చే డిసెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లోనూ పూర్తవుతాయి. తర్వాత రెండో దఫా సమావేశాలు ప్రారంభిస్తాం. ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం 40 రోజుల కార్యక్రమంగా చేశాం. భవిష్యత్తులో ఇంకా తక్కువ రోజుల్లోనే ఇంటింటికీ చేరాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందిస్తాం' అని లోకేశ్ వెల్లడించారు.

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..
ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది. ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..
వాటిని మెడల్స్ గా భావిస్తా: రాహుల్ గాంధీ

ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం
విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ
కనిపిస్తున్నారు.. భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు. మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోబ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు. మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు. విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోబ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్-భూటాన్ సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు. భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, జల విద్యుత్, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. భూటాన్ రాజు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. రైలు మార్గాలు, సరిహద్దు మౌలిక వసతులు, విమాన, డిజిటల్ కనెక్టివిటీ అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..
దర్శనానికి 12 గంటలు

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నాటికి, శ్రీవారి దర్శనం కోసం 31 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. మంగళవారం (అక్టోబర్ 6) ఒక్కరోజే 73,629 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, టీటీడీ నిన్న 3.91 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో 1.75 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,334 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

రాయలసీమకు ఏం చేశారు?
రూ.24,000 కోట్లు ఎక్కడ?: చంద్రబాబుపై రోజా ఫైర్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, అభివృద్ధిపై కేవలం గొప్పలు చెబుతోందని ఆమె ఆరోపించారు. చిత్తూరులో మీడియాతో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేదన్నారు. "రాయలసీమపై ప్రేమ ఉందని చెబుతారు. కానీ ఈ ప్రాంతానికి ఏం చేశారు? రూ.24,000 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టామని అంటున్నారు. అవి ఎక్కడున్నాయో ప్రజలకు చూపించండి" అని రోజా సవాల్ విసిరారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరవు, చంద్రబాబు కవలలని, ప్రస్తుత పాలనలో నీటి కొరత మరింత తీవ్రమైందని ఆమె వ్యాఖ్యానించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ హయాంలో చేపట్టిన సాగునీటి, వ్యవసాయ చర్యల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని రోజా సూచించారు. 'రైజింగ్ రాయలసీమ' అంటూ నినాదాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో అధికారిక లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోటీ పడుతున్నారని ఆమె ఆరోపించారు.

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక..
రెండు డీఏలు విడుదల

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిప

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉచితంగా విద్యా ఉపకరణాల పంపిణీ

కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 7, (మహి న్యూస్): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, దివ్యాంగులకు విద్యా ఉపకరణాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని విద్యార్థులకు విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రమణారెడ్డితో పాటు ఎంఈఓలు రమేష్, చంద్రశేఖరరావు, బాల పుల్లారెడ్డి, జీకే గైబు, జనార్దన్‌రెడ్డి, హర్షద్, అనంత నాయుడు, నవీన్ రాయల్, నాగూర్, ఐఈఆర్‌సీలు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

- డిఎఫ్ఓ కె. బాలరాజు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 7: వైఎస్సార్ కడప జిల్లా అటవీ శాఖ అధికారిగా నూతనంగా నియమితులైన కె. బాలరాజు, ఐఎఫ్ఎస్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. గిద్దలూరు సబ్ డివిజన్ నుంచి బదిలీపై వైఎస్సార్ కడప జిల్లా అటవీ శాఖ అధికారిగా కె. బాలరాజు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

హెచ్‌పీవీ టీకాలో కడప జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం

కడప, అక్టోబర్ 7 (మహి న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పర్యవేక్షక సిబ్బంది నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో చేపట్టిన వైద్య ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం అందించే హెచ్‌పీవీ టీకాల కార్యక్రమంలో కడప జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఇదే తరహా ప్రగతిని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో సాధించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో కలిసి పనిచేస్తూ సేవల నాణ్యతను పర్యవేక్షించాలని, మాతా శిశు మరణాల నివారణకు నిరంతర సేవలు అందించాలని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100 శాతం అమలు చేసి 12 రకాల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించాలని సూచించారు. టీకాల వివరాలను కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు అందించే మాతా శిశు సంరక్షణ కార్డులో అన్ని సేవల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. పిల్లలకు ఐరన్ సిరప్‌ను వారానికి రెండు పర్యాయాలు అందించాలని, కుష్ఠు వ్యాధి కేసుల ఇంటింటి సర్వేను ఈ నెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో పక్కా ప్రణాళికతో ప్రగతి సాధించాలని, ఇకపై కార్యక్రమాల సమీక్ష సూచికల వారీగా ఉంటుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి కడప జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. సమావేశంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ మనోహర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు

కూటమి ప్రభుత్వ లక్ష్యం ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి

కడపజిల్లా /జమ్మలమడుగు అక్టోబర్ 7, (మహి న్యూస్): రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి అన్నారు. అమరజీవి జలధార సభ విజయవంతం కావడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలో అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సభ విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని భూపేష్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటే వైకాపా నాయకులు ఓర్వలేక విమర్శలు చేయడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. కడప జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని విమర్శించారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పుకోవడం వైకాపా నాయకులకే చెల్లిందన్నారు. మిషన్ రాయలసీమ ద్వారా రాయలసీమ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతోందని తెలిపారు. కొప్పర్తి, ఓర్వకల్లు ప్రత్యేక ఆర్థిక మండళ్ల అభివృద్ధితో పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. రాయలసీమలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కడప జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని భూపేష్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ముందుకు సాగుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఆధ్వర్యంలో సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్, మీడియా సమన్వయకర్త జనార్దన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి

కడప మహి న్యూస్ , అక్టోబర్ 07: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, కడప ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి సూచించారు. జిల్లా పోలీస్ శాఖ కళాజాతా బృందం ఆధ్వర్యంలో

కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ఈగిల్ క్లబ్ కన్వీనర్ ఆయుఖాన్ ఆధ్వర్యం వహించగా, ఎస్సై సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ఈగిల్ క్లబ్ కన్వీనర్ డా. పి.వి. కృష్ణారెడ్డి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ కళాజాతా బృందం

స్కిట్ ద్వారా మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించింది. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తుపై చూపే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి జీవితం, కుటుంబ సంబంధాలు ఎలా దెబ్బతింటాయో కళాజాతా బృందం ప్రదర్శన ద్వారా వివరించింది. ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని, దేశ శీల నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు, పరిసరాల్లో మాదక ద్రవ్యాల వినియోగం లేదా అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రభావం, చెడు స్నేహాలు తదితర కారణాలతో కొంతమంది యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయం వంటి నేరాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు సమస్యలు ఎదురైతే పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ ఉత్పత్తి, రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి చట్టపరమైన శిక్షలు ఉంటాయని అధికారులు వివరించారు. యువతను వ్యసనాల నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల్లో నిరంతర అవగాహనా కార్యక్రమాలు అవసరమని డా. పి.వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈగిల్ క్లబ్ సభ్యులు, పోలీస్ అధికారులు, కళాజాతా బృందం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశాన్ని కార్యక్రమం ద్వారా అందించారు.

పోషణతోనే ఆరోగ్యకరమైన తరానికి బలమైన పునాది...!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

పోషకాహార లోపం లేని జిల్లాగా కడపను తీర్చిదిద్దడమే లక్ష్యం

'మన అంగన్‌వాడీ-మన బాధ్యత'తో పోషణ మాసం విజయవంతం

అంగన్‌వాడీల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం అవసరం

కడప, మహి న్యూస్ అక్టోబర్ 07 : జిల్లాలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది గత కొన్నేళ్లుగా చేస్తున్న సమష్టి కృషి వల్ల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన సూచీల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం--2026 జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా.

శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పోషణ మాసం విజయవంతంగా కొనసాగడానికి చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న "పోషణ మాసం" కేవలం ప్రభుత్వ శాఖల కార్యక్రమంగా కాకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన సామాజిక ఉద్యమంగా భావించాలన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సమతుల్యమైన పోషకాహారం అందించడం, రక్తహీనతను తగ్గించడం, తల్లులు, పిల్లల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, బాలల సమగ్ర వికాసానికి అవసరమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో చేపట్టిన నిరంతర చర్యలు అభినందనీయం అన్నారు. ఆకాంక్ష జిల్లా, ఆకాంక్ష మండల కార్యక్రమాల్లో ఆరోగ్యం, పోషణ అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని, ఈ అంశాల్లో కడప జిల్లా వరుసగా త్రైమాసికాల్లో దేశంలో అగ్రస్థానంలో నిలవడం వెనుక క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావం, పటిష్టమైన అమలు విధానం ప్రధాన కారణమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందిని అభినందించారు. ఆరోగ్యం, పోషణ రెండు వేర్వేరు అంశాలు కాదని, రెండూ పరస్పరం అనుసంధానమై ఉంటాయని కలెక్టర్ వివరించారు. తల్లి ఆరోగ్యం, శిశువు ఆరోగ్యం, చిన్నారుల ఎదుగుదలతో పాటు పెద్దల ఆరోగ్యానికి కూడా సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారమే పునాది అని తెలిపారు. శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఏదైనా లోపిస్తే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు వారి అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల్యమైన పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందని, అందించే ఆహార నాణ్యత, పంపిణీ, అమలును నిరంతరం పర్యవేక్షించే విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే పోషకాహారం అందించడంతో పాటు కుటుంబాల్లో ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లలకు ఏం తినాలో చెప్పడంతో పాటు ఏం తినకూడదో కూడా స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా తయారీ ప్రక్రియకు గురైన చిరుతిళ్లు, శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు తదితరాలకు చిన్నారులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన రుచి, రూపం, ప్యాకింగ్‌తో మార్కెట్లోకి వస్తున్న ఇలాంటి పదార్థాల్లో సహజమైన పోషక విలువలు తక్కువగా ఉండే అవకాశం ఉందని, అధిక తయారీ ప్రక్రియ కారణంగా పీచు వంటి ముఖ్యమైన పోషకాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల పిల్లలకు ఇటువంటి ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి సహజమైన, స్థానికంగా లభించే పోషకాహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రెండు నుంచి ఐదేళ్ల వయస్సు వరకు పిల్లలకు ఆటలు, కథలు, మాటలు, బొమ్మలు వంటి సులభమైన పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, అనారోగ్యకరమైన ఆహారం మధ్య తేడాను వివరించాలని సూచించారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పే విషయాలు పిల్లల మనసుల్లో బలంగా నాటుకుపోతాయని, అందువల్ల ఈ దశలో కల్పించే అవగాహన వారి జీవితాంతం ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారాన్ని కుటుంబాలు ఎక్కువగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బొప్పాయి తక్కువ ఖర్చుతో విటమిన్ 'ఎ', 'సి' వంటి ముఖ్యమైన పోషకాలను అందించే మంచి పండు అని, ఇలాంటి స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు తదితరాలను రోజువారీ ఆహారంలో భాగం చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారతదేశంలో బియ్యం ఆధారిత ఆహారం ఎక్కువగా తీసుకునే అలవాటు ఉందని, ఫలితంగా ఆహారంలో కార్బోహైడ్రేట్ల శాతం అధికంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. బియ్యం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభించినప్పటికీ, కేవలం శక్తిని అందించే ఆహారంతో సంపూర్ణ పోషణ సాధ్యం కాదని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు శరీర నిర్మాణం, ఎదుగుదల కోసం ప్రోటీన్ తగిన మోతాదులో అందాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చిన్నారుల మెదడు అభివృద్ధికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, ఒమేగా కొవ్వు ఆమ్లాలు కూడా తగిన మోతాదులో లభించేలా ఆహారంలో వైవిధ్యం ఉండాలని సూచించారు. అన్నంతో పాటు కొద్దిపాటి కూర లేదా పప్పుతో భోజనం పూర్తయిందని భావించకుండా ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర పోషక పదార్థాలను సమతుల్యంగా ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల ఆహారంలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు తగిన మోతాదులో ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల జీవితంలో తొలి రెండేళ్లు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన దశ అని కలెక్టర్ వివరించారు. పుట్టిన తర్వాత తొలి 15--18 నెలల్లో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఐదేళ్ల వరకు కూడా ఈ అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ఈ దశలో అవసరమైన పోషకాలు సరైన మోతాదులో అందకపోతే పిల్లల శారీరక, మానసిక, మేధో వికాసంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి, ప్రతి చిన్నారికి మెరుగైన పోషకాహారం, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, సురక్షిత వాతావరణం అందించడంతో పాటు పోషకాహార లోపం లేని, ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ... "మన అంగన్‌వాడీ--మన బాధ్యత" అనే భావనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కేవలం మహిళా, శిశు సంక్షేమ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి శాఖ, ప్రజాప్రతినిధి, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థ, యువజన సంఘాలు భాగస్వామ్యంతో బాలవడులు భవిష్య తరాలకు బాటలు వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనకు సహకరించేలా ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. అంగన్‌వాడీల అభివృద్ధి, పిల్లల పోషణ, పరిశుభ్రత వంటి అంశాల్లో స్థానిక సమాజం జవాబుదారీతనం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న స్థలాలను ఉపయోగించుకుని పోషణ తోటలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు స్థలం, కంచె, నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కూరగాయల విత్తనాలు, కూరగాయల కిట్లు, మునగ, బొప్పాయి తదితర మొక్కలను అందించాలని ఆదేశించారు. స్థానికంగా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను పిల్లల పోషణకు ఉపయోగించుకునే విధంగా కుటుంబాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం ఒక సమన్వయ సమావేశం, ఒక సామూహిక భోజన రుచి పరీక్ష, ఒక పోషక వంటకాల ప్రదర్శన, ఒక పోషణ మేళా, ఒక ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రత్యేక నమోదు శిబిరం నిర్వహించడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. డిఎంహెచ్ఓ యుగంధర్ మాట్లాడుతూ... పోషణ మాసం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి కుటుంబంలో ఆచరణాత్మక మార్పుకు దారితీసేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితో జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యశాఖ ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల గుర్తింపు, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. విద్యాశాఖ పాఠశాల సిద్ధత కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సమన్వయ సమావేశాల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన పిల్లలను బాలల అభివృద్ధి కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. డీఈవో శంశుద్దీన్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద అర్హులైన గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామసభల్లో అంగన్‌వాడీ సేవలపై సమీక్ష నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కూడా బాధ్యత స్వీకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు తల్లులు, గర్భిణీలను పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలకు భాగస్వాములను చేయాలని, అంగన్‌వాడీల్లో అందించే భోజనాన్ని పర్యవేక్షించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగుపరచాలని, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి సేకరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐసిడిఎస్ పీడి రమాదేవి మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్ ఆలోచనా సామర్థ్యం, నేర్చుకునే సామర్థ్యం, మేధో వికాసం, శారీరక ఎదుగుదలకు తొలి దశలో అందే పోషకాహారం బలమైన పునాది వేస్తుందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లల విద్యాభివృద్ధికి ఎంత ముఖ్యమో, అంతకంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులు అందించే పోషకాహారం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అందువల్ల తొలి రెండేళ్లలో పిల్లలకు సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారం అందించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, పోషణ్ మాసంలో చేపట్టిన, అంగన్వాడీ కేంద్రాల విశిష్టతను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ మిలన్ జిల్లా కన్వీనర్ చేపూరి శారదమ్మ, జిల్లా మహిళా, మిషన్ పోషణ్ 2.0 జిల్లా సమన్వయకర్త బి. లవణ్ కుమార్ రెడ్డి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

తల్లి, బిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం కీలకం

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): తల్లి, బిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పోషణ మాసం--2026 జిల్లా స్థాయి కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి, పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గుడ్లు, పాలు, పప్పులు, శనగలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని,

ఆరు నెలల తర్వాత పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అదనపు ఆహారం అందించాలని తెలిపారు. అంగన్వాడీల్లో పిల్లల ఎదుగుదల, ఆహారం, ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో ఎంపికైన 9 మంది పోషణ్ ఛాంపియన్ తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.”

22-ఏ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

15 రోజులకు మించి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి
ఫేజ్-6 గ్రౌండ్ ట్రూథింగ్ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి
హౌస్‌సైట్స్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి
ఈ-ఆఫీస్ పెండింగ్ ప్రక్రియ శుక్రవారం లోగా పూర్తి చేయాలి

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): 22-ఏ భూములకు సంబంధించి 15 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సమీక్షలో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రీ సర్వే ఫేజ్--4, ఫేజ్--5లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫేజ్--6లో 44 గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నూలు అర్బన్, కల్లూరు, ఎమ్మిగనూరు అర్బన్, ఆదోని అర్బన్‌లో పెండింగ్‌లో ఉన్న హౌస్‌సైట్స్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు, కేటాయించిన స్థలాలు, నిర్మాణాల వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ-ఆఫీస్‌కు సంబంధించిన మెయిల్ ఐడీలు, సిబ్బంది మ్యాపింగ్, డిజిటల్ కీ తదితర ప్రక్రియలను శుక్రవారం లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 22-ఏ కేసుల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. సమీక్షలో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు, సర్వే అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు అభివృద్ధికి పెద్దపీట

లొద్దిపల్లెలో రూ.30 లక్షలతో తాగునీటి పనులకు శ్రీకారం
ఉయ్యాలవాడలో రూ.1.03 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ
రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
రూ.30.30 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం
మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, అక్టోబర్ 7: (మహి న్యూస్): పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు నిర్వహించారు. లొద్దిపల్లెలో జల జీవన్ మిషన్--2.0 కింద రూ.30 లక్షలతో నూతన బోరు, పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఉయ్యాలవాడలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి టీటీడీ నిధులు రూ.1.03 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. పల్లె పండుగ--1, 2, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే రూ.30.30 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించి, పల్లె పండుగ--3 కింద మరో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఉప్పలపాడులోనూ అవసరమైన మౌలిక వసతుల పనులను దశలవారీగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మూడు గ్రామాల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులను కొనసాగిస్తామని గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19 ఉద్యానవనాల అభివృద్ధికి రూ.1.94 కోట్లు

తుది దశకు చేరుకున్న అభివృద్ధి పనులు
నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాల అభివృద్ధి పనులను వేగవంతం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రూ.1.94 కోట్లతో 19 ఉద్యానవనాల్లో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. బుధవారం వీనస్ కాలనీలోని జెండా పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించిన కమిషనర్.. గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెంకటరమణ కాలనీలోని జీటీఎస్ స్టేషన్, బళ్లారి చౌరస్తాలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈ గిరిరాజ్, డీఈ కృష్ణలత, టీఏఈ రాంమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి
సీసీ కెమెరాలతో నిరంతర నిఘా, పటిష్ట బందోబస్తు
వైద్య, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
అక్రమ మద్యం, అవాంఛనీయ ఘటనల నియంత్రణకు కఠిన చర్యలు

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): దేవరగట్టు బన్ని ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవ ప్రాంతం, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రధాన మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, తగినంత లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దేవరగట్టులో అత్యవసర వైద్య సేవల కోసం 30 పడకల ఆసుపత్రి, అంబులెన్సులు, స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఇరుకైన మార్గాల్లో అత్యవసర సేవలకు చిన్న అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇనుప రింగులు అమర్చిన కర్రలను ముందుగానే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, దివిటీలు విసరడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవ ప్రాంతం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అనంతరం శ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

ప్రయోగాత్మక అభ్యసనంతో భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి
అంతరిక్ష సాంకేతికతతో రైతులకు ప్రయోజనాలు
ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల, అక్టోబర్ 7: (మహి న్యూస్) అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెంచుకొని, ప్రయోగాలు, పరిశోధనల ద్వారా విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అంతరిక్ష సాంకేతికత కమ్యూనికేషన్‌తో పాటు వాతావరణ అంచనాలు, విపత్తుల హెచ్చరికలు, పంటల పరిస్థితి, నేల తేమ వంటి అంశాల్లో రైతులకు ఉపయోగపడుతోందని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, క్రమశిక్షణతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామాగ్రి సిద్ధం చేయాలి
సీసీ కెమెరాలు, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
విధుల్లో నిర్లక్ష్యం వద్దు

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ఎన్నికల సన్నాహకాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని, హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎన్ఓసీ జారీ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. మేయర్ అభ్యర్థికి పింక్, కార్పొరేటర్ అభ్యర్థికి వైట్ బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తామని తెలిపారు. షామియానాలు, బారికేడ్లు, భోజన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు.

హోర్డింగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఏజెన్సీలు బకాయిలు తక్షణం చెల్లించాలి
అనుమతి లేని హోర్డింగులకు ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి
లేకుంటే హోర్డింగులు తొలగిస్తాం: కమిషనర్

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) నగరంలోని హోర్డింగుల ఏజెన్సీలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం హోర్డింగుల ఏజెన్సీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులకు ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. బకాయిలు చెల్లించకపోతే అనధికార హోర్డింగులుగా పరిగణించి తొలగిస్తామని హెచ్చరించారు. కార్పొరేషన్ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

ఓర్వకల్లు మండలంలో తాగునీటి పనులకు శ్రీకారం

కాల్వలో రూ.1.11 కోట్లతో ఓహెచ్ఆర్ ట్యాంకు ప్రారంభం
ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ కార్యక్రమానికి శ్రీకారం
కాల్వబుగ్గలో రూ.44 లక్షల ఓహెచ్ఆర్ ట్యాంకుకు భూమిపూజ

ఓర్వకల్లు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కాల్వ, కాల్వబుగ్గ గ్రామాల్లో తాగునీటి పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ బుధవారం శ్రీకారం చుట్టారు. కాల్వలో జలజీవన్ మిషన్ 2.0 కింద రూ.1.11 కోట్లతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకును ప్రారంభించారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ కల్పించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. కాల్వబుగ్గలో రూ.44 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఆర్ ట్యాంకుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వేదవతి, సుద్దవాగు, హంద్రీ-కేసీ కెనాల్ పనులు వేగవంతం

వేదవతి ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణ పనులకు వేగం పెంచాలి
సుద్దవాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
రోడ్లు, హెల్త్ క్లినిక్స్, ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి



కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) జిల్లాలో చేపడుతున్న ఇరిగేషన్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఎంఎస్ఎంఈ పార్కుల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. వేదవతి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. కర్నూలు నగరంలోని సుద్దవాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. హంద్రీ, కేసీ కెనాల్ ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో పరిశుభ్రత పనులకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. హెల్త్ క్లినిక్స్, రోడ్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పూర్తయిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. హౌసింగ్ పనుల్లో గ్రౌండింగ్ శాతం 47 శాతంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, నీటి వసతుల పనులను వచ్చే నాలుగు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు క్రమశిక్షణతో కృషి చేయాలి

పదో తరగతి విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందించాలి
విద్యార్థినుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి సూచించారు. కలెక్టరేట్ సమీపంలోని బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. నీటి నిల్వకు ఇబ్బంది ఉందని విద్యార్థినులు తెలపడంతో అదనపు మున్సిపల్ వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని, సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, విద్య ద్వారా ఉన్నత అవకాశాలు సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవచ్చన్నారు. బాలికలు ఉన్నత విద్య కొనసాగించి తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని వంట సిబ్బందిని, అధికారులను ఆదేశించారు.

మీడియేషన్‌తో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన
మీడియేషన్‌తో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు
కక్షిదారులను మధ్యవర్తిత్వం వైపు ప్రోత్సహించాలి

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని మీడియేషన్ రీసోర్స్ పర్సన్ ఆర్. విజయ కమల సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు మీడియేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, చెన్నై నుంచి వచ్చిన విజయ కమల కార్యక్రమంలో పాల్గొన్నారు. మీడియేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, నిబంధనలు, రెగ్యులేషన్లు, చట్టం గురించి న్యాయవాదులకు వివరించారు. తమ కక్షిదారులను మధ్యవర్తిత్వం వైపు ప్రోత్సహించి, సాధ్యమైనన్ని ఎక్కువ కేసులను మీడియేషన్ ద్వారా పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించాలి

న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై అవగాహన
కర్నూలు హెడ్‌క్వార్టర్ న్యాయమూర్తులకు ప్రత్యక్ష శిక్షణ
నంద్యాల, కర్నూలు జిల్లాల న్యాయమూర్తులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన

కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని మధ్యవర్తిత్వ రిసోర్స్ పర్సన్ ఆర్. విజయ కమల సూచించారు. సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ విభాగం ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా అరవ అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ ప్రధాన న్యాయమూర్తి పి. వాసు ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు హెడ్‌క్వార్టర్ న్యాయమూర్తులకు ప్రత్యక్షంగా, కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయమూర్తులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com